క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

జలుమూరు: మండలంలోని ఉసిరికజ్వోల ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఎం.వి.ఆర్.ప్రసాద్ మంగళవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ నాణ్యతలో రాజీపడవద్దన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించాలన్నారు. పాఠాన్ని గుర్తుండేలా బోధించడం, రాయించడం, చదివించడం వల్ల చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు పి.సూరిబాబు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

పాతపట్నం: మండలంలోని కొరసవాడకు చెందిన మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావుకు గ్రామస్తులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మత్స్యకారులకు చెందిన పూరిపాక అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని, అందులో చేపలు పట్టే వలలు కాలిబడిదయ్యాయన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ మద్దు రామారావు, లక్ష్మి, కుమారి, అప్పారావు, రామయ్య తదితరులు ఉన్నారు.

నీలమణిదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ఆలయంలో వేచివున్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ఆలయానికి తెల్లవారు జామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు చేశారు.

చురుగ్గా పూడికతీత పనులు



పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఏఈ శ్యామ్

నరసన్నపేట: మండలంలోని కోమర్తి వద్ద జాతీయ రహదారి ఆనుకుని రావులవలస మెరక చానల్‌లో పూడికతీత పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన ప్రత్యేక నిధులతో పనులు చేపడుతున్నామని వంశధార ఏఈ అల్లు శ్యామ్ మంగళవారం తెలిపారు. చానల్‌లో చేపడుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. కోమర్తి నుంచి డోల కూడలి వరకు పూడిక అధికంగా ఉండటంతో రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపడుతున్నామన్నారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు.

జీసీసీ డీలర్ మృతికి సంతాపం



బాబూరావు (ఫైల్)

పాతపట్నం: మండలంలోని బద్దుమర్రి పంచాయతీ శిష్టుజగన్నాథపురం గ్రామానికి చెందిన జీసీసీ డీలర్ తెంబూరు బాబూరావు (45) అనారోగ్యంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సోమవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావు మంగళవారం తెలిపారు. మృతుడుకి భార్య దశమి, కుమార్తె జ్ఞానేశ్వరి, కుమారుడు చరణ్ ఉన్నారు. ఈయన మృతి పట్ల తహసీల్దార్, సీఎస్‌డీటీ భీమారావు, డీటీ ప్రసాదరావు, రేషన్ డీపో డీలర్లు సంతాపం తెలిపారు.

4న ద్విచక్ర వాహనాల వేలం

పాతపట్నం: మద్యం, సారా అక్రమంగా రవాణా చేస్తుండగా పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను ఈ నెల 4వ తేదీన ఉదయం 11 గంటలకు పాతపట్నం పోలీస్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నారు. ఈ మేరకు పాతపట్నం ఎస్ఐ మహమ్మద్ యాసిన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఎవరైనా వేలం పాటలో పాల్గొనవచ్చని, వేలం పాటకు హాజరైనవారు ఆధార్ కార్డ్ జిరాక్స్, రూ.1,000 డిపాజిట్ చేయాలన్నారు.

దుర్వాసనతో అవస్థలు



మహేంద్ర తనయ నది ఒడ్డున ఉన్న కాలువలో మాంసం వ్యర్థాలు వేస్తున్న దృశ్యం

- రహదారి పక్కనే చికెన్ వ్యర్థాలు
- కుక్కల తిష్టతో ప్రయాణికులకు ఇబ్బంది

మెళియాపుట్టి: మండల కేంద్రంలో చికెన్ వ్యర్థాలను మహేంద్రతనయ నది ఒడ్డున వేయడంతో వాహనదారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. వ్యర్థాల కోసం కుక్కలు నిత్యం రహదారిలో గుంపులు సంచరిస్తున్నాయి. ఆంధ్రా–ఒడిశాకు రాకపోకలు కొనసాగిస్తున్న వాహనదారులకు కుక్కలు అడ్డంగా రావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గ్రామం నుంచి వర్షం నీరు మహేంద్ర తనయ నదిలోకి వెళ్లే కాలువలో మాంసం వ్యర్థాలు పడవేస్తున్నారు. కాలువ పూడికపోవడమే కాకుండా.. నీరు కలుషితం అవుతుంది. శ్మశాన వాటిక ఇదే ప్రాంతంలో ఉండటంతో అంత్యక్రియల సమయంలో కుళ్లిన వ్యర్థాల నుంచి దుర్గంధం వెదజల్లడంతో గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. గ్రామ పంచాయతీలో చెత్తసంపద తయారీ కేంద్రం, డంపింగ్ యార్డు లేకపోవడమే ఇందుకు కారణమని కూడా పలువురు చెబుతున్నారు. పంచాయతీ యంత్రాంగం దీనిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



మెళియాపుట్టి రహదారిపైనే గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

కుక్కల స్వైరవిహారం



రహదారిలో కుక్కల గుంపు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి వేళల్లో మరింత ఇబ్బందిగా ఉంటుంది. కోడి మాంసం చెత్తంతా తీసుకువచ్చి మహేంద్రతనయ మలుపులో ఉన్న కాలువలో వేయడమే ఇందుకు కారణం. చాలాసార్లు కుక్కలు అడ్డం వచ్చి వాహనాలు అదుపుతప్పి పడిపోయిన సంఘటన్యాలున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

– అప్పలరాజు, ఆటో డ్రైవర్, మెళియాపుట్టి గ్రామం

చర్యలు తీసుకుంటాం



గ్రామ పంచాయితీలో ఉన్న మాంసం దుకాణదారులతో మాట్లాడతాం. మాంసం వ్యర్థాలను జన సంచారంలేని ప్రదేశాల్లో వేయాలని ఆదేశిస్తాం. లేకపోతే దుకాణదారులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఇకపై మాంసం మహేంద్రతనయ ఒడ్డున వేయకుండా చర్యలు తీసుకుంటాం.

– చింతల అప్పారావు, పంచాయతీ కార్యదర్శి, మెళియాపుట్టి

25 వేల ఎకరాలకు సాగునీరు

బూర్జ: నారాయణపురం ఎడమ కాలువ ద్వారా సుమారు 25 వేల ఎకరాలకు సాగు నీరు అందించడం జరుగుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని నారాయణపురం ఆనకట్ట, ఎడమ కాలువను మంగళవారం పరిశీలించారు. ఆనకట్టకు సంబంధించిన వివరాలు సేకరించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కాలువ మరమ్మతులు, అభివృద్ధికి సంబంధించిన నిధులు సమకూర్చుతానన్నారు. ఎస్ఈ పి.సుధాకర్, డీఈ ఎం.మురళీ మోహన్, ఏఈలు కె.రాంబాబు, ఎస్.శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాలపోలమ్మ అమ్మవారికి పూజలు..

ఆమదాలవలస: పట్టణ గ్రామదేవత పాలపోలమ్మను ఎమ్మెల్యే కూన రవికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. గ్రామదేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు.



ఆనకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కొత్తూరు: సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ అన్నారు. మండలంలోని కర్లెమ్మ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌నాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుద్ధ్య, క్లోరినేషన్ పనులను మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం కింద పారిశుద్ధ్య పనులు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు. కర్లెమ్మ ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయిలను పరిశీలించారు. బోర్లు, నీటి ట్యాంకుల వద్ద నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారాపురంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఉప సర్పంచ్ పోతల మణికంఠ, పంచాయతీ కార్యదర్శి రామనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రమణ

దోమల నివారణకు చర్యలు

హిరమండలం: దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు హిరమండలం మేజర్ పంచాయతీ ఈఓ వై.ఎస్.ఆర్.మూర్తి అన్నారు. హిరమండలంలోని మెండ, మోనింగు, కైక, తుంగాన వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇంటి ఆవరణంలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. రాత్రి వేళల్లో దోమ తెరలు వాడాలని సూచించారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



హిరమండలంలో ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

గుర్తింపు కార్డులు తప్పనిసరి



మెళియాపుట్టి: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ మధుబాబు



నరసన్నపేట: మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సునీత

ఎల్.ఎన్.పేట: కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలని ఏఓ పైడి లతశ్రీ అన్నారు. మండలంలోని పెద్దకోట 1, 2 పరిధిలో మంగళవారం రైతులతో గ్రామ సభలను నిర్వహించారు. 2024–25 ఖరీఫ్ పంట కాలానికి గుర్తింపు కార్డులు కావాల్సిన రైతులు వీఆర్వోలను సంప్రదించాలని సూచించారు. భూ యజమాని పట్టాదారు పాసుపుస్తకం, 1బి, ఆధార్ కార్డు జిరాక్స్‌లతోపాటు కౌలు రైతు ఆధార్ కార్డు జిరాక్స్, మూడు ఫొటోలు, దరఖాస్తులను వీఆర్వోలకు సమర్పించాలన్నారు. కార్డు ఉన్నవారు అన్నదాత సుఖీభవ పథకం, పంటల బీమాకు అర్హత పొందుతారన్నారు. సర్పంచ్ ముగడ దివాకర నాయుడు, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నరసన్నపేట: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామని, అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత అన్నారు. మండలంలోని బొరిగివలసలో మంగళవారం కౌలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సంవత్సరంలో ఖరీఫ్, రబీ పంట కాలానికి పొలం కౌలుకు సాగు చేస్తున్న రైతులు వినియోగించుకోవాలన్నారు. 11 నెలలు కౌలు రైతు కార్డులు వినియోగంలో ఉంటాయన్నారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: కౌలు రౌతులకు అన్ని విధాలా సహాయ అందిస్తామని పలాస ఏడీ మధుబాబు అన్నారు. గొప్పిలి, గోకర్ణపురం గ్రామాలలో మంగళవారం కౌలు రైతులకు అవగాహన కల్పించారు. కౌలుదారు కార్డు తీసుకున్న రైతులకు పంటబీమా, రాయితీపై విత్తనాలు, ఎరువులు, మద్దతు ధర, నష్టాలకు కూడా తగిన పరిహారం ఇప్పిస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏ, వీఆర్వోలకు దరఖాస్తులు అందించాలన్నారు. కౌలు రైతులకు భూ యజమానులు సహకరించాలన్నారు. మండలవ్యవసాయ శాఖ అధికారి ధానకర్జుడు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని కౌలు రైతుల గుర్తింపు, నమోదు కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి పి.చిరంజీవి తెలిపారు. మంగళవారం అంపలాం, ఉర్లాం గ్రామాలో నిర్వహించిన అవగాహన సమావేశాలకు హాజరయ్యారు. కౌలు చేస్తున్న ప్రతి రైతు కూడా గుర్తింపు పొందితేనే పంట రుణాలు, ఈ – క్రాప్ నమోదు, నష్టపరిహారం, ఇతర ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని తెలిపారు.

ఆమదాలవలస: కౌలు రైతులందరూ గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా క్రాప్ట్ కల్టివేటెడ్ రైట్ కార్డ్ (సీసీఆర్‌సీ) కార్డు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహన్‌రావు సూచించారు. మండలంలోని తోటాడ రైతు సేవా కేంద్రంలో సీసీఆర్‌సీ కార్డులపై మంగళవారం అవగాహన కల్పించారు. వరి, ఇతర పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు.

అంకిత భావంతో పనిచేయాలి



సృజనీకుమారిని సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

సారవకోట: వైద్యులు వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలని బుడితి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సృజనీకుమారి అన్నారు. ఆస్పత్రిలో డాక్టర్స్ డే సందర్భంగా వైద్యలను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య వృత్తి గొప్పదన్నారు. రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. వైద్యులు వినోద్‌కుమార్, చైతన్య, భార్గవి, సత్యసాయి, వసుధ, గౌండు మురళి, బెవర శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

హిరమండలం: మేజర్ పంచాయితీ మైత్రీ కాలనీకి చెందిన గౌండు రమేష్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో తమవంతు సాయం చేసేందుకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. మంగళవారం ఎల్ఎన్‌పేటకు చెందిన కారు డ్రైవర్ సి.హెచ్.భాను, ఎ.హరి బ్రదర్స్ రూ.12,500 ఆర్థిక సాయం అందించారు. చిన్నకోరాడకు చెందిన ఫ్రెండ్స్ యూత్ సభ్యులు చోడి సింహాచలం, టి.రామకృష్ణ రూ.10 వేలను మృతుడు భార్యకు అందజేశారు.

ఈఓపీఆర్డీగా అదనపు బాధ్యతలు



ప్రసాదరావు

కొత్తూరు: మండల ఈఓపీఆర్డీగా బీసీ ప్రసాదరావు (బసవ రాంబాబు)కు జిల్లా పంచాయతీ అధికారి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీఓ త్రివిక్రమరావు మంగళవారం తెలిపారు. ఇంతవరకు ఈఓపీఆర్డీగా పనిచేసిన కె.కృష్ణారావు గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. పరిపాలన సౌలభ్యం కోసం ఇదే కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న ప్రసాదరావుకు ఈఓపీఆర్డీ అదనపు బాధ్యతలను అప్పగించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

పోలాకి: మండలంలో ఏఒక్క పంచాయతీలో కూడా పారిశుద్ధ్య పనులపై ఫిర్యాదులు రాకూడదని ఎంపీడీఓ ఉషశ్రీ సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. డ్రైనేజీలు, రోడ్లు, పాఠశాలలు, తదితర జనావాసాల మధ్యలో అపారిశుద్ధ్యం ఉండకూడదన్నారు.

దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మోహిని

హిరమండలం: మండలంలోని సుబలయ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన బర్రి మోహిని తన తండ్రి గోవిందరావు జ్ఞాపకార్థం స్థానిక డిఎస్సార్ చర్చిలో 60 మంది వృద్ధులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ డి.స్వరాజ్ మాట్లాడుతూ నిరుపేదలకు సాయం అందించడం ఎంతో సంతోషకరమన్నారు. మోహినిని అభినందించారు. బర్రి సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అతిసారంపై అప్రమత్తం



సరుబుజ్జిలి: అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సరుబుజ్జిలి: చిన్నారులకు వ్యాపించే నీళ్ల విరోచనాలు (అతిసారం) పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మోహన్‌రావు తెలిపారు. అతిసార వారోత్సవాల సందర్భంగా మండలంలోని రొట్టవలస విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మంగళవారం అవగాహన కల్పించారు. టీడీపీ నాయకులు, ఏఎస్ఎం తేజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట: వర్షా కాలంలో డయేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దీనిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి అరవింద్ అన్నారు. ఉర్లాంలో పీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందితో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే తగిన వైద్యం అందించాలని, ఇతర కుటుంబ సభ్యులను అప్రమత్తం చేయాలని సూచించారు. అవసరమైన మందులు సబ్ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయన్నారు. సబ్ సెంటర్, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డెంగీపై కూడా ప్రజలకు తగు సూచనలు చేయాలన్నారు. వైద్య సిబ్బంది టి.గణపతిరావు, జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: మాట్లాడుతున్న డాక్టర్ అరవింద్

పాతపట్నం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల వైద్య సిబ్బంది, బీజేపీ నాయకుడు ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ ఇళ్లు, పరిసరాలలో ఎక్కువ కాలం నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు ఉన్న చోట దోమలు ఉంటాయని, రాత్రి వేళల్లో దోమ తెరలు వాడాల్నారు. దోమకాటు వల్ల చికిన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులు ప్రబలుతాయన్నారు. జ్వరం, జలుబు, దగ్గు వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాలన్నారు.

నిధులు మంజూరు చేయాలి

హిరమండలం: మండలంలోని మజ్జిగూడెం ఎత్తుపోతల పథకం నిర్మాణానికి కొత్త ఎస్ఎస్ఆర్ రేట్లతో నిధులు మంజూరు చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు అక్కరాపల్లి ఉప సర్పంచ్ కె.నీలవేణి, మాజీ సర్పంచ్ గొర్ల సింహాచలం మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ మండలంలోని అక్కరాపల్లి, పిండ్రువాడ, కిట్టలపాడు పంచాయతీల పరిధిలో ఉన్న గిరిజన రైతులకు సుమారు 729 ఎకరాల మెట్ట భూములకు సాగునీరు అందించేందుకు రూ.976.64 లక్షల నిధులతో 2018లో మజ్జిగూడెం ఎత్తుపోతల పథకం మంజూరైందన్నారు. పనులు ప్రారంభించి గుత్తేదారుడు మధ్యలోనే నిలిపివేశాడన్నారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో పలువురు నాయకులు, గిరిజన రైతులు ఉన్నారు.



ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సేవలే గుర్తింపునిస్తాయి

కొత్తూరు: కొత్తూరు ఈఓపీఆర్డీగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కె.కృష్ణారావును మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఉద్యోగికి సేవలే గుర్తింపునిస్తాయని ఎంపీడీఓ త్రివిక్రమరావు అన్నారు. ఎంపీపీ సవర సావిత్రి, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఏఓ బసర రాంబాబు, మాజీ సర్పంచ్ పడాల వెంకటకృష్ణ, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు అంపిలి ప్రశాంత్, కార్యాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కృష్ణారావును సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నరసన్నపేట: మండలంలోని గుండవల్లిపేటలో లలితా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు వనమాళి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు మాట్లాడుతూ బుధవారం స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దరఖాస్తుల ఆహ్వానం

మెళియాపుట్టి: మండలంలోని పెద్దమడి బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మధు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీలో 1, బైపీసీలో 4, సీఈసీలో 14 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 2024 మార్చిలో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన (బాలురు) మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 8వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. దరఖాస్తులను కళాశాలలో అందించాలన్నారు.

జూట్ బ్యాగుల తయారీపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకళంలోని బ్యాంకర్స్ కాలనీ సత్యసాయి సేవా సమితి సాయి బృందావనం ఆధ్వర్యంలో జూట్ బ్యాగుల తయారీ, స్క్రీన్ ప్రింటింగ్‌పై 30 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మహిళల కోసం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19 నుంచి 35 ఏళ్ల వయసులోపు మహిళలకు శాశ్వత స్వయం ఉపాధి కల్పించే నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు వివరాలకు 99480 04156, 94403 98049, 83319 00152 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సేవా సమితి ప్రతినిధులు